


నేడు కేఎంఎఫ్ బోర్డు సమావేశం

బళ్లారి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్) బోర్డు సమావేశం బుధవారం బళ్లారిలో నిర్వహించనున్నట్లు కేఎంఎఫ్ మాజీ డైరెక్టర్ ధనుంజయ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కేఎంఫ్ అద్యక్షుడు రాఘవేంద్ర హిట్నాల్ పాల ఉత్పత్తి, ప్రస్తుతం వస్తున్న పాలు, అమ్ముడుపోతున్న పాలు, పెరుగు, నెయ్యి, వెన్న ఇతర ఉత్పుత్తులపై సభ్యులతో చర్చిస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే కేఎంఎఫ్ జిల్లా అధ్యక్షుల ఎన్నికపైనా కూడా ఆయన చర్చిస్తారన్నారు.

వీరి.. జాడేది..?

● రాష్ట్రంలో పెరిగిపోతున్న మిస్సింగ్ కేసులు ● అమ్మాయిలే అధికం
● బెంగుళూరు నగరంలోనే ఎక్కువ కేసులు ● ఐదేళ్లలో 14వేల కేసులు..
● తక్షణమే ఫిర్యాదు చేయకపోవడమే అసలు సమస్య అంటున్న పోలీసులు





తప్పిపోయిన బాలికలు			బాలురు	
ఏడాది	కేసులు	గుర్తింపు	కేసులు	గుర్తింపు
2020	1137	1104	421	402
2021	1630	1591	487	482
2022	1829	1785	745	715
2023	2131	2083	907	869
2024	2446	2293	975	920
2025	1619	933	551	385
జూలై దాకా				
మొత్తం	10,792	9,789	4,086	3,753

బెంగళూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తప్పిపోయిన చిన్నారుల కేసులు పెరిగిపోతున్నాయి. ట్యూషన్‌కు వెళ్లినవారు వెనుదిరిగి రావడం లేదు. సెలవుల్లో క్రికెట్ లేదా ఇతరత్రా ఆటలకోసం బయటకు వచ్చినవారు ఒక్కొక్కరు కనిపించకుండా పోతున్నారు. వారు ఎక్కడికి పోతున్నారనేది అంతు చిక్కని అయోమయంగా మారుతోంది. ఒకరిద్దరు పిల్లలు కల్గిన తల్లిదండ్రులు తప్పిపోయినవారికోసం వెతికివెతికి విసుగుచెంది మానసికంగా కుంగిపోతున్నారు. ఒకరా ఇద్దరా... ఏటా వెయ్యిమందినుంచి 1600మందికిపైగానే ఆచూకీ లేకుండా వెళ్లిపోతున్నారు. ఇలా కనిపించకుండా పోయినవారు ఏదైనా సమస్యతోనో, లేదా చదువులో వెనుకబాటుతోనో, లేదా కుటుంబంలో ఒత్తిళ్లతోనో అంటే ఇమడలేక వెళ్లారనుకోవచ్చు. కానీ చదువులో రాణిస్తూనే కుటుంబీకులతో సన్నిహితంగా ఉంటూనే, క్రీడలు లేదా మిత్రులతో సరదాగా గడిపేవారు ఆచూకీ లేకుండా పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలో తప్పిపోతున్నవారి సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూనే ఉంది.

● 2020 నుంచి 2025 జూలై వరకు 14,878మంది పిల్లలు తప్పిపోయారు. వారిలో 13,342మంది మళ్లీ చేరుకున్నారు. పోలీసుల చొరవ, కుటుంబీకుల గాలింపు, అంతకుమించి సోషల్ మీడియాతో పాటు ఇతరత్రా ప్రచారాల ద్వారా వెనువెంటనే చర్యలు ప్రారంభం అవుతుండడంతో దొరికిపోతున్నారు. తప్పిపోయినవారిలో బెంగళూరు నగర జిల్లా అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానంలో దావణగెరె, ఉడుపి, దక్షిణకన్నడ, హావేరి, చిత్రదుర్గ, తుమకూరు, మైసూరు జిల్లాలు ఉన్నాయి.

● హోంశాఖ గణాంకాల ప్రకారం 2025 జూలై వరకు 2,170మంది పిల్లలు తప్పిపోయారు. వారిలో బాలురు 551మంది, బాలికలు 1619మంది ఉన్నారు. కుటుంబ కలహాలు, తల్లిదండ్రులు విడిపోవడంతోపాటు పలు కారణాలతో పిల్లలు తప్పిపోతున్నారు. మరోవైపు 15ఏళ్లు దాటిన బాలికలు ప్రేమ అనే ఆకర్షణలో పడి ఇల్లు వదిలిపోతున్నట్లు గుర్తించారు. ఇలాంటివారంతా బాలకార్మికులుగా మారిపోతున్నారు. వీరిని లొంగదీసుకుని చోరీలు, వేశ్యావాటికలకు పంపే ముఠాలు ఉన్నాయి. మరికొందరిని అవయవాలు విక్రయించే ముఠాలు కూడా ఇటువంటివారికోసమే గాలింపు జరుపుతుంటాయి. కొంతమందిని గంజాయి తదితర వ్యసనాలకు బానిస చేసి ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి యాచకులుగా మారుస్తుంటారు. అనారోగ్యానికి గురైతే గోల్డెన్ అవర్‌లోగా ఆసుపత్రికి తరలించాలనే రీతిలోనే పిల్లలు తప్పిపోతే గోల్డెన్ డేగా 24 గంటలలోగా సమాచారం ఇస్తే ప్రధాన రవాణా వ్యవస్థలైన బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లలలో సమగ్రంగా గాలింపు జరిపితే లభించే అవకాశాలు ఉంటాయని



పోలీసు ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. పోలీసులకు ఫొటోతోపాటు సమగ్ర సమాచారం ఇస్తే రాష్ట్రవ్యాప్తంగా పోలీసుశాఖను హై అలర్ట్ చేసి వారు ఏమార్గంలో వెళ్తున్నారో గుర్తించడం సాధ్యమంటున్నారు. సీసీటీవీలు, మొబైల్ నెట్‌వర్క్ ఆధారంగా గుర్తిస్తున్నట్లు పోలీసులు అభిప్రాయపడుతున్నారు. ఎక్కువమంది తప్పిపోయిన వారిలో తల్లిదండ్రుల నిర్లక్ష్యం, పేదరికం, మహానగరాల వ్యామోహం వంటివి కారణాలుగా ఉన్నాయని పోలీసు గణాంకాలు నిర్ధారిస్తున్నాయి. పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారనేది తల్లిదండ్రులు గమనించాల్సి ఉంటుందంటున్నారు. ప్రధానంగా చదువులో వెనుకబాటు, పరీక్ష ఫలితాలు ప్రకటించినప్పుడు ఫెయిల్ అయితే ధైర్యం చెప్పాలిగానీ ఇతరులతో పోల్చి ఇంట్లోనే వేధిస్తే వారు మానసికంగా కుంగిపోయి ఎంతటికైనా తెగించే పరారీ అవుతున్నారన్నారు. పోలీసుశాఖ పిల్లలను టార్గెట్ చేసే ముఠాలపట్ల నిఘా పెట్టామని ఇందుకోసమే కీలకమైన ప్రాంతాలలో మఫ్టీలోనూ సిబ్బంది ఉంటారన్నారు. తప్పిపోయినవారిలో బాలురైతే ఓ విధంగాను, బాలికలైతే మరో విధంగాను ఉపయోగించుకునేందుకు ముఠాలు పనిచేస్తున్నాయన్నారు.



నిర్లక్ష్యంపై హైకోర్టు మందలింపు

తప్పిపోయినవారిని గుర్తించకుండానే మిస్సింగ్ కేసులకు ముక్తి పలుకుతున్నారని దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు ధర్మాసనం రాష్ట్రప్రభుత్వం, పోలీసుశాఖను తీవ్రస్థాయిలో మందలించింది. సమగ్ర వివరణ ఇవ్వాలని పోలీసుశాఖను ఆదేశించింది. పోలీసు చర్యను ప్రశ్నిస్తూ బెంగళూరు విజయనగర ప్రాంతానికి చెందిన మహేశ్ దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం న్యాయమూర్తి జస్టిస్ సూరజ్ గోవిందరాజు ఏకసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కాసేపు వాదనలు విన్న న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి 8 నిమిషాలకొకరు తప్పిపోతున్నారంటే ఎలాగని ప్రశ్నించారు. మిస్సింగ్ కేసుల్లో ఆచూకీ లభించకపోయినా ఎలా కేసులు మూసివేస్తున్నారని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించి సమగ్ర వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. పిటిషనర్ తరఫున న్యాయవాది కుమార్ వాదనలు వినిపించారు. అన్నపూర్ణేశ్వరినగర్ పోలీస్‌స్టేషన్‌లో స్వయంగా మహేశ్ తప్పిపోయిన కుటుంబ సభ్యుడికి సంబంధించి పిర్యాదు చేశారన్నారు. ఇటీవల సదరు కేసును మూసివేసినట్లు సమాచారం తెలిసిందని న్యాయవాది ధర్మాసనం ముందు వివరించారు. దీంతో సమగ్ర వివరణ ఇవ్వాలని ధర్మాసంన ఆదేశించింది.

నేనే

కొత్త టోపీలు సూచించింది..

● ముఖ్యమంత్రి సిద్దరామయ్య
● ఇండియా జస్టిస్ నివేదికలో కర్ణాటక పోలీస్ నంబరు వన్‌గా ఉందని ప్రశంసలు



సీఎంకు మహిళా పోలీసు సెల్యూట్



కానిస్టేబుళ్లకు నూతన టోపీలు ధరింపజేస్తున్న సీఎం, డీసీఎం, హోంమంత్రి

బెంగళూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీసులు వాడుతున్న క్యాప్‌ను మార్చాలని నేనే సూచించానని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. విధానసౌధలో మంగళవారం కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లకు కొత్త టోపీల పంపిణీకి శ్రీకారం చుట్టారు. పీక్ క్యాప్‌ను కానిస్టేబుళ్లకు ధరింపచేసి ఎలా ఉన్నాయంటూ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 1956 నుంచి స్లోచ్ క్యాప్‌లను వాడుతున్నారన్నారు. 70ఏళ్లుగా ఉన్న విధానంలో మార్పు తీసుకొచ్చామన్నారు. అధికారులు, పోలీసులు ఒకే విధమైన క్యాప్ ధరించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చాలనేది తన ఆశయమన్నారు. ఇది ప్రతి పోలీసు లక్ష్యం కావాలని సూచించారు. ఇండియా జస్టిస్ నివేదికలో కర్ణాటక పోలీసులు నెంబరు వన్ స్థానంలో ఉన్నారన్నారు. మంగళూరులో మతఘర్షణలు, నైతిక పోలీస్‌గిరి వంటివాటిని నియంత్రణలోకి తీసుకొచ్చామని ఇదే విధానం కొనసాగించాలన్నారు. కొందరు పోలీసులు రియల్టర్‌లుగాను, డ్రగ్స్ పెడ్లర్‌లతో సంబంధాలు కలిగి ఉన్నట్లు ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయని ఇది సరికాదన్నారు. డ్రగ్స్ విక్రేతలను కాదని మూలాలను గుర్తించాలన్నారు. పోలీసుశాఖ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే ప్రభుత్వానికి మంచి పేరు ఉంటుందన్నారు. డీసీఎం డీకే శివకుమార్, హోం మంత్రి పరమేశ్వర్, చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్, డీజీపీ ఎంఏ సలీం సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నీ సలహాతో ప్రాజెక్టు ఆపలేం

● టన్నెల్ రోడ్డు పనులపై ఎంపీ తేజస్వికి తేల్చి చెప్పిన డీసీఎం డీకే

బెంగళూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా సొరంగ మార్గంతోపాటు పలు అంశాలపై విమర్శలు చేసుకున్న డీసీఎం డీకే శివకుమార్, ఎంపీ తేజస్వీసూర్య భేటీ అయ్యారు. మంగళవారం డీసీఎం నివాసానికి వచ్చిన ఎంపీ పలు అంశాలపై చర్చలు జరిపారు. అనంతరం డీసీఎం మీడియాతో మాట్లాడుతూ బెంగళూరు అభివృద్ధికి సంబంధించి పలు ప్రతిపాదనలను తేజస్వి సూచించారని వాటిని పరిశీలిస్తామన్నారు. ప్రధానంగా లాల్‌బాగ్‌లో టన్నెల్‌రోడ్డు ఏర్పాటు చేయరాదని సూచించారన్నారు. ఇప్పటికే ఆ విషయాన్ని బహిరంగం చేశానని, ఎట్టి పరిస్థితిల్లోనూ లాల్‌బాగ్ మీదుగా సొరంగ మార్గం ఉండదన్నారు. ప్రత్యామ్నాయం ఏం చేయాలని కోరినందుకు సొరంగమార్గమే వద్దని తేజస్వీసూర్య తెలిపారన్నారు. అందుకు నీ సలహాతో ప్రాజెక్టును ఆపివేయలేమని తేల్చి చెప్పానన్నారు. అవుటర్ రింగ్‌రోడ్డులు పెంచాలని, సబర్బన్ రైళ్లు రావాలని తెలిపారన్నారు. అందుకు కేంద్రంలో రైల్వేశాఖ సహాయమంత్రి సోమణ్ణతో చర్చిద్దామని తీర్మానించామన్నారు. కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని సూచించానన్నారు. ఎంపీలతో ప్రధానమంత్రిని కలుద్దామన్నారు.



డీసీఎం డీకే శివకుమార్‌తో ఎంపీ తేజస్వి సూర్య

ప్రైవేటు బస్సులో రూ.కోటి నగదు

● ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్న పోలీసులు

బెంగళూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గోవా నుంచి బెంగళూరుకు వస్తున్న ఓ ప్రైవేటుబస్సులో కోటి రూపాయల నగదు రవాణా చేస్తుండగా ఉత్తరకన్నడ జిల్లా చిత్తాపుర పోలీసులు గుర్తించారు. రాజస్థాన్‌కు చెందిన కల్పేశ్, బమరరావు అనే ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు బెంగళూరులో నివసించేవారు. గోవా నుంచి బెంగళూరుకు ఓ ప్రైవేటు బస్సులో నగదుతో సోమవారం రాత్రి బయల్దేరారు. బస్సులో భారీగా నగదు వస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో కారవార, గోవా సరిహద్దులోని మాజాడి చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు జరిపారు. రెండు లెదర్‌బ్యాగులలో నగదు ఉన్నట్లు గుర్తించారు. 500 రూపాయల ముఖవిలువైన నోట్లు ఉన్నాయని పోలీసులు తెలిపారు. నగదుకు సంబంధించి వారివద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని, వారిని అదుపులోకి తీసుకున్నారు. నగదుతో వచ్చినవారికి నోటీసులు జారీ చేశారు. ఆధారాలు సమర్పిస్తే నగదు వాపసు చేస్తామని, లేనిపక్షంలో కేసు నమోదు చేస్తామని పోలీసులు ప్రకటించారు.



స్వాధీనం చేసుకున్న నగదు, నిందితులు



అరటి పంటను మార్కెట్‌కు తరలిస్తున్న రైతులు

అరటి.. లాభాల్లో మేటి

● ధరలు బాగున్నాయంటున్న రైతులు ● కంప్లిలో అధిక దిగుబడులు

కంప్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అరటి రైతులు ఈ ఏడు అధిక లాభాలతో ఖుషీ.ఖుషీగా ఉన్నారు. కంప్లి పరిధిలో సాగు చేసిన చాలా మంది రైతులు పంట పుష్కలంగా పండడమే కాక ధరలు కూడా బాగా ఉనాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. నుండే ఆంధ్ర, తెలంగాణ, బెంగళూరు, తమిళనాడు తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. విజయనగర కాలువ కింద వుండే రైతన్నలు అరటి పంటపై ఎక్కువ ఆసక్తితో పంటలు పండిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అరటిపంట రైతులకు కాస్త లాభాల బాటలోనే కొనసాగుతున్నారు. రెండు నెలలుగా కిలో రూ.25 నుంచి రూ.30 పలుకుతోందని దీంతో కాస్త లాభాలు మిగులుతున్నాయని అన్నదాత హర్షం వ్యక్తం చేస్తున్నారు. కంప్లి, బెళగోడుహాళ్, కంప్లి కోటే, రామసాగరం, తదితర గ్రామాల్లో అరటిని అధికంగా సాగు చేశారు.



అరటి గెలలు

ఇద్దరు పిల్లలను హతమార్చి...
తల్లి ఆత్మహత్య

బెంగళూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లాలో ఇద్దరు పిల్లలను హతమార్చి తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం కుకనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బెణకల్ గ్రామంలో లక్ష్మి భజంత్రి (30), పిల్లలు రమేశ్ (3), జానవి(2)లను హతమార్చి తర్వాత ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సమస్యలు కారణమై ఉంటాయని భావించారు. అయితే మృతురాలు లక్ష్మి తల్లి బసవ్వ ఆరోపణలతో కొత్త అంశం వెలుగులోకి వచ్చింది. అదే గ్రామానికి చెందిన బీరప్ప అనే వ్యక్తితో లక్ష్మికి వివాహేతరసంబంధం ఏర్పడిందని, అతడి ఒత్తిడిని తట్టుకోలేక కొన్ని నెలలకాలంగా ఇబ్బంది పడుతున్నట్లు ఆరోపించారు. భర్త పిల్లలను వదిలిపెట్టి వచ్చేయాలని, ఇద్దరం కలసి కాపురం చేద్దామని బీరప్ప వేధించాడని అదే మానసికంగా ఇబ్బంది కలిగి లక్ష్మి ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. తొలుత ఇద్దరి పిల్లలను ఉరి వేసి హతమార్చిన తర్వాత లక్ష్మి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. జిల్లా ఎస్పీ డాక్టర్ రామ్ ఎల్ అరసిద్ది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

15న బళ్లారి మేయర్ ఎన్నిక

బళ్లారి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బళ్లారి మహానగర పాలికె ఎన్నికలకు తేదీ ఖరారు అయ్యింది. మేయర్, ఉప మేయర్, నాలుగు స్థాయి సమితీ సభ్యుల ఎన్నికకు కలబుర్గి డివిజన్ అధికారి తేదీ ఖరారు చేస్తూ ఆదేశాలు జారీచేశారు. నవంబరు 15న ఎన్నికలు నిర్వహించనున్నారు. 24వ అవధి మేయర్ స్థానాన్ని జనరల్ కేటరిగిరీకి, ఉపమేయర్ స్థానాన్ని జనరల్ మహిళ కేటగిరీకి కేటాయించారు. వీటితో పాటు నాలుగు స్థాయి కమిటీ సభ్యులను ఎన్నికల చేయనున్నారు అని బళ్లారి నగర పాలికె కమిషనర్ మంజునాథ తెలిపారు. బళ్లారి నగర పాలికెలో మొత్తం 39 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరితో పాటు ఐదుగురు నామినేటెడ్ ఓటర్లున్నారు. మొత్తం 44 మంది మేయర్, ఉపమేయర్లను ఎనుకోనున్నారు.



బళ్లారి మహానగర పాలికె కార్యాలయం

కన్నడ సాహిత్య పరిషత్ పాలనాధికారిగా
గాయత్రి బాధ్యతల స్వీకరణ



బెంగళూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కన్నడ సాహిత్య పరిషత్‌లో నిధులు, అధికార దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో కసాప పాలనాధికారిగా కేఎం గాయత్రి బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం కన్నడ సంస్కృతిశాఖ డైరెక్టర్‌కు పాలనాధికారిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసిన మేరకు మంగళవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. విచారణకు సంబంధించి కన్నడ సాహిత్య పరిషత్‌కు చెందినవారు గడువులోగా హాజరు కాకపోవడం, అవసరమైన రికార్డులు సమర్పించకపోవడం వంటి కారణాలతో పాలనాధికారిని నియమించాలని సహకార శాఖ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీంతో కేఎం గాయత్రిని నియమించారు. కన్నడ సాహిత్యపరిషత్ అధ్యక్షులుగా ఉన్న మహేశ్‌జోషికి ఈ పరిణామం తీవ్ర అవమానం కలిగించినట్లయ్యింది. రానున్న మూడు నెలలు లేదా ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి విచారణ ముగిసేదాకా పాలనాధికారి పర్యవేక్షించనున్నట్లు ఆదేశాలలో పేర్కొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	14,965	15,792
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	14,760	15,432
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77

31న మారథాన్

● సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా..

● అందరూ పాల్గొనాలి: ఎస్పీ శోభారాణి



బళ్లారి సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య సమరయోధుడు భారత ఏకీకరణ నిర్మాత సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ అక్టోబరు 31న ఉదయం 7గంటలకు నగరంలోని డీఏఆర్ పోలీస్ ఫరేడ్ గ్రౌండులో రన్-ఫర్ యూనిట్ మారథాన్‌ను నిర్వహిస్తుందని జిల్లా ఎస్పీ శోభారాణి తెలిపారు. మంగళ వారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పౌరుల భద్రత, బాధ్యతల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ రేసు నగరంలోని డీఏఆర్ పోలీస్ ఫరేడ్ గ్రౌండు నుంచి ప్రారంభమై ర్యాలీ ఇందిరా సర్కిల్- కొత్త జిల్లాపరిపాలన భవనం ఎంజీ రోడ్డు అనంతపురం బైపాస్ వరకు తిరిగి వస్తుందని ఎస్పీ అన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో

ఉచిత కంటి పరీక్షలు

బళ్లారి రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అగర్వాల్ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో కంటోన్మెంట్ జయరాం స్కూలు విద్యార్థులు దాదాపుగా 200 మందికి పైగా విద్యార్థులు కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు జీ శ్రీనివాసరెడ్డి జోనల్ ఛైర్‌పర్సన్ రాజేష్ పాఠశాల ఛైర్మన్ మిదిలేశ్వర్ ప్రిన్సిపాల్ అగర్వాల్ ఆస్పత్రి సభ్యులు ప్రకాష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అయోడిన్ ఉప్పులో సంపూర్ణ పోషకాలు

● గర్భిణులు వాడాలి ● చిన్నారులు కూరగాయలు, పాలు తీసుకోవాలి ● డాక్టర్ మరియంబి సూచన



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మరియంబి

బళ్లారి సిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అయోడిన్ మానవులకు తప్పక అవసరమైన సూక్ష్మపోషకమని, ప్రతిఒక్కరూ రోజువారీ ఆహారంలో ఉప్పు రూపంలో వాడడంతో సంపూర్ణ పోషకాలు సాధ్యమవుతాయని సర్వేయర్ డాక్టర్ మరియంబి అన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లాసర్వే యూనిట్ సంయుక్త ఆధర్యంలో అయోడిన్ లోప నియంత్రణ కార్యక్రమం కింద నగరంలోని ప్రభుత్వ (మాజీ మున్సిపాలిటీ) ప్రీ-యూనివర్శిటీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ అయోడిన్ లోప నియంత్రణ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శారీరక, మానసిక అభివృద్ధికి అయోడిన్ చాలా అవసరమని, థైరాయిడ్ గ్రంథి మన శరీరానికి అవసరమైన హార్మోన్లను ఉత్పత్తి చేయడానికి అయోడిన్ అవసరమన్నారు. మనం రోజు అకుకూరలు, కూరగాయలు తినాలని, తాజా కూరగాయలతోపాటు అయోడైజ్డ్ ఉప్పును ఉపయోగించాలని ఆమె అన్నారు. ఉప్పుజాడిని గట్టిగా మూసివేయడం ద్వారా అయోడిన్ లోపం వల్ల కలిగే లోపాలను నియంత్రించవచ్చన్నారు.

ఈకార్యక్రమంలో మైక్రోబయాలజిస్ట్ శరత్‌బాబు మాట్లాడుతూ పిల్లలు పెద్దలు గర్భిణుల్లో అయోడిన్ లోపం అధికంగా కనిపిస్తోందన్నారు. ప్రధానంగ పిల్లలలో మానసిక వైకల్పం, మరుగుజ్జుత్వం, శరీర బాగాల పెరుగుదల మందగించడం, పెద్దలలో బలహీనత, పనితీరులో వైఫల్యం, గాయిటర్, గర్భిణుల్లో తరచుగా గర్భస్రావాలు, పునరుత్పత్తి సమస్యలు, వైకల్యాలు, మానసిక వైకల్యం ఉన్న పిల్లలు పుట్టే అవకాశం ఉందన్నారు.

ప్రజలు తమ వయస్సును బట్టి రోజువారీ ఆహారంలో ఎంత అయోడిన్ తీసుకోవాలో తెలుసుకోవాలన్నారు. మున్సిపల్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకప్ప మాట్లాడుతూ మానవ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అయోడిన్ కంటెంట్ చాలా ముఖ్యమైనదన్నారు. అందువల్ల ఆరోగ్య శాఖ ప్రకటించిన ముందు జాగ్రత్త చర్యలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు తమ కుటుంబాలకు చుట్టు ప్రక్కల ప్రజలకు అయోడైజ్డ్ ఉప్పును ఉపయోగించమని తెలియజేయాలని, వారితో అవగాహన కల్పించాలన్నారు. తరువాత ఉప్పులో అయోడిన్ శాతాన్ని పరీక్షించే ప్రయోగాత్మక పద్ధతి గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈసందర్భంగా కళాశాల అచార్యులు నాగరాజప్ప, గాదిలింగప్ప, తిమ్మప్ప, అక్కి మల్లికార్జున, ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జబీన్‌తాజ్, జిల్లాపొగాకు సలహాదారు ప్రశాంత్,జిల్లా సర్వే విభాగం సిబ్బంది, జిల్లాకంట్రోల్ టీమ్ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

యువతే దేశ సంపద

● బాధ్యతగా మెలిగి లక్ష్యాన్ని సాధించాలి : యువజనోత్సవంలో హామీల అమలు అథారిటీ చైర్మన్ చిదానందప్ప



మాట్లాడుతున్న హామీ పథకాల అమలు అథారిటీ చైర్మన్ చిదానందప్ప



కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన

బళ్లారి సిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): యువత దేశ సంపద... యువతరం ఎల్లప్పుడూ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని జిల్లా హామీ పథకాల అమలు అథారిటీ చైర్మన్ చిదానందప్ప అన్నారు. జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ యువజన సాధికారత , క్రీడా శాఖ, జిల్లాలోని అన్ని సంస్థల సహకారంతో నగరంలోని జిల్లా స్టేడియం రోడ్డలోని డాక్టర్ జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరం హాల్లో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి యువకుడు యువతిలో భిన్నమైన, ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుంది. మీరు దృఢ సంకల్పం కలిగి ఉండి మీ లక్ష్యాన్ని చేరుకుంటే విజయం సొంతమవుతుందని యువతకు పిలుపునిచ్చారు. విద్యతో పాటు యువత అనేక రంగాల్లో తమను తాము నిమగ్నం చేసుకుని ముందుకు సాగాలన్నారు. కుటుంబ నేపథ్యంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ యువత ఆశలు వదులుకోకుండా తమ కలల సాకారానికి కృషి చేయాలని యువత మంచి లక్షణాలను సంస్కారాన్ని అలవర్చుకున్నప్పుడే ప్రతిదీ సాధించగలమని ఆయన అన్నారు. ఇటీవలి కాలంలో యువత మొబైల్ ఫోన్ వ్యసనంలో పడకుండా, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల నమ్మకాన్ని అగౌరవపరచకుండా జీవితంలో మంచి మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. యువత కోసం ఇలాంటి యువజనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని యువత ఎక్కువ మంది పాల్గొనాలని ఆయన అన్నారు. క్రీడా శాఖ దృష్టి చారించి రాబోయే రోజుల్లో మరింత మంది పాల్గొనేలా కృషి చేయాలన్నారు.

జిల్లాకళాకారుల సంఘం అధ్యక్షుడు యల్లనగౌడ శంకరబండే ప్రసంగానికి అధ్యక్షత వహించి గీగి పద పాడి యువతను ఉత్సాహపరిచారు. యువజన సాధికారత క్రీడా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కే.గ్రేసీ మాట్లాడుతూ యువజన సాధికారత శాఖ ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని,యువత తమ కళ ప్రతిభను ప్రదర్శించడానికి ఇది మంచి వేదిక అన్ని అన్నారు. యువత తమ కళ ప్రతిభను ప్రదర్శించడానికి, బళ్లారి జిల్లాకు కీర్తిని తీసుకురావడానికి వేదికను ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. తదనంతరం వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులచే జానపద నృత్యం, జానపదపాటలు, కథా రచన. చిత్రలేఖనం, ప్రసంగం, కవిత్వం, సైన్స్ ఫెయిర్, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో వివిధ ప్రముఖులను ,జానపద కళాకారులను సత్కరించారు.

ఈసందర్భంగా సాహితీవేత్త సహాయ ఆచార్యులు,డాక్టర్ శ్యాంమూర్తి, విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం కన్నడ విభాగం అధ్యాపకులు డాక్టర్ షకీల్,మాతృ మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ షకీల,బిఐటీఎం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పుష్పాచంద్రశేఖర్, రవీంద్ర హిరేమఠ్, కొర్లగుంది కళాశాల యువకులు వీరేశ్ స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీసీ మహమ్మద్ జుబేర్

కనకదాస జయంతికి ఏర్పాట్లు చేయండి

● అధికారులకు ఏడీసీ మహమ్మద్ జుబేర్ ఆదేశం

బళ్లారి సిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): భక్త కనకదాస జయంతిని నవంబరు 8న జిల్లా కేంద్రంలో గౌరవప్రదంగా అర్థవంతంగా జరుపుకోవాలని జిల్లా ఏడీసీ(అదనపు కలెక్టర్) మహమ్మద్ జుబేర్ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లాకలెక్టర్ కార్యాలయం హాల్లో జరిగిన ప్రాథమిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ జయంతి కార్యక్రమాన్ని అర్థవంతంగా జరుపుకుని విజయవంతం చేయడానికి అన్ని సన్నాహాలు చేయాలని ఆదేశించారు. 8న నగరంలోని కుమారస్వామి ఆలయం సమీపంలోని మున్సిపల్ రోడ్డులోని మున్సిపల్ కళాశాల మైదానం నుంచి గడిగ చెన్నప్ప సర్కిల్ ,బెంగళూరు రోడ్డు, బ్రూస్‌పేట పోలీస్ స్టేషన్, జైన్ మార్కెట్ రోడ్డు ,హెచ్ ఆర్ గవియప్ప సర్కిల్ నుంచి డాక్టర్ జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరం వరకు కనకదాసు చిత్రపటంతో ఊరేగింపు జరుగుతుందని , వివిధ రకాల కళా బృందాలు ఊరేగింపులో పాల్గొంటాయన్నారు. కార్పొరేషన్ అధికారులు సీటింగ్, తాగునీటి ఏర్పాట్లు చేయాలని పారిశుద్ధ్యపనులు చేపట్టాలని ఆదేశించారు. దాస శేష్ఠ కనకదాసు సమాజాభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆయన తత్వాలను జీవితంలో అమలు చేయాలని అన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి జయంతిని జరుపుకోవడానికి అందరి సహకారం అవసరం. కాబట్టి జిల్లాస్థాయి అధికారులు, పాఠశాల కళాశాల పిల్లలు, సాధారణ ప్రజలు స్వచ్ఛందంగా జయంతి కార్యక్రమంలో సమన్వయంతో జరుపుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో దీనిని తప్పనిసరిగా చేయాలని, దీనిని డీడీపీయూ అధికారులు పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. భక్తకనకదాసు సిద్ధాంతాలతో కూడిన బుక్‌లెట్‌ను విడుదల చేయాలని సంఘం నాయకులు సమావేశంలో ప్రతిపాదించారు. ఈసందర్భంగా కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు,సంఘ నాయకులు పాల్గొన్నారు.

రాజ్యోత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం

● కరవే నియోజకవర్గ అధ్యక్షుడు బలే మల్లికార్జున



డైరెక్టర్ వీబీ నాగరాజును అభినందిస్తున్న కరవే సభ్యులు

కంప్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సారి నవంబరు 1న కర్ణాటక రాజ్యోత్సవాన్ని అత్యంత వైభవంగా జరుపుకోవాలని కరవే (నారాయణ గౌడ వర్గం) కంప్లి నియోజకవర్గ అధ్యక్షుడు బలే మల్లికార్జున అన్నారు. మంగళవారం పట్టణ అతిథి గృహంలో జరిగిన ప్రాథమిక సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన ప్రతి సంవత్సరం నవంబరు 1న ప్రతి చోటా కన్నడ రాజ్యోత్సవాన్ని అర్థవంతంగా జరుపుకోవడం, యువతరానికి కన్నడ దేశ చరిత్ర సంస్కృతం, కళ, భాష గురించి అవగాహన కల్పించడం మనందరి ప్రాథమిక కర్తవ్యమన్నారు. కంప్లి తాలుకా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సహకార సంఘానికి కరవే తాలూకా ఉపాధ్యక్షుడు విబి నాగరాజు సభ్యుడుగా నియామకం కావడంతో ఆయనను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో తాలుకా అధ్యక్షుడు రాజశేఖర్, సిటీ అధ్యక్షుడు జంగలి నాగరాజు, సోషల్ మీడియా ప్రెసిడెంట్ కంబలి రామకృష్ణ, ఆఫీస్ బేరర్లు, జీరు గణేష్, దొడ్డమనే గణేష్, ఉమేష్, బల్లాపుర మౌనేష్, హర్ష, శంభులి, గణేష్, యల్లప్ప, మంజునాథ, మున్నా, రఘు, షేక్షావలి, రంజిత్, హరీష్, వాసుకుమార్, శ్రీకాంత్, సునిల్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సిరుగుప్ప, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): చదరంగం పోటీల్లో పట్టణానికి చెందిన ఎస్‌ఈఎస్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు సాయిచరణ్, మైత్రి, భూమిక బళ్లారిలో జరిగిన జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో ప్రథమ స్థానంలో విజయం సాధించారు. యాదగిరి, మండ్య జిల్లాల్లో జరుగబోయే రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ముఖ్య ఉపాధ్యాయులు లిల్లి థామస్, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్ వారిని అభినందించారు.

హోసూరు జోన్

వైద్యశాఖపై కలెక్టరేట్‌లో సమీక్ష



సమావేశంలో కలెక్టర్ దినేశ్‌కుమార్, ఇతర అధికారులు

హోసూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా కలెక్టర్ ఎస్ దినేశ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం జిల్లా ఆరోగ్య వైద్య శాఖ సమీక్షా సమావేశం జరిగింది. ప్రసూతి, శిశు ఆరోగ్యం, శస్త్రచికిత్స, మరణాల ప్రమాణం, కుక్క కాటుకు చికిత్సపై సమీక్షించారు. సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాలలో జిల్లా ప్రాథమిక విద్యా సేవలు, మానసిక ఆరోగ్య చికిత్స కేంద్రం, పిల్లలకు పోషకాహారం అందించడం, ఆర్థోపెడిక్ విభాగంలో కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు, ముఖ్యమంత్రి సమగ్ర ఆరోగ్య బీమా పథకం క్రింద 84 మందికి అందించే చికిత్సపై చర్చలు జరిగాయి. ఇంకా డెంకణీకోట ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చికిత్స పనితీరుపై ఆరా తీశారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో క్యాన్సర్ చికిత్సల పనితీరును నేరుగా తనిఖీ చేస్తారని తెలిపారు, ఇంకా క్యాన్సర్ ,రోగుల సంక్షేమం కోసం ఐవిడిపి కలిసి పనిచేయాలని తెలిపారు. కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాలలోని కార్డియాక్ కాథెటరైజేషన్ ల్యాబ్, (హార్ట్ కాథెటరైజేషన్ ల్యాబరేటరీ), ప్రజలకు మెడిసిన్ (హెల్త్‌కేర్ స్టాలిన్) పథకం, (ఇన్నూయిర్ కాపోం, మరో ప్రాణం కాపాడాలి)అనే మొత్తం 48 పథకాల అమలుపై సమీక్షించారు. ఇంకా న్యూరో విభాగం, ప్లాస్టిక్ సర్జరీ విభాగాలలో రోగి విభాగాలను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రసూతి మరణాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

కుక్కకాటుకు నిరంతర వైద్యం

కుక్క కాటుకు గురైనప్పుడు వెంటనే బాధితులకు చికిత్స అందించాలని సూచించారు. కుక్క కరిచినా లేదా నాకినా ,లేదా గోళ్లతో గీకినా వెంటనే సబ్బుతో శుభ్ర పరుచుకోవాలని సూచించారు. పెంపుడుకుక్కలకు అవసరమైన టీకాలు వేయించేలా ప్రజలలో చైతన్యం కల్పించాలన్నారు. ఇటీవలికాలంలో కుక్క కాటుకు గురయ్యేవారు అధికమయ్యారని, 24 గంటల పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో చికిత్సలు ఉంటాయన్నారు. సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యభామ, జాయింట్ డైరెక్టర్ (సంక్షేమం), డాక్టర్ జ్ఞానమీనాక్షి, చైల్డ్ వెల్ఫేర్ డాక్టర్ మధు, డాక్టర్ ధనశేఖర్, వైద్య అధికారులు, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ ఎళిలరసి, డాక్టర్ ఉమా మహేశ్వరీ, శాఖా అధికారులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని దంపతుల ఆత్మహత్య

» అసోం వాసులుగా గుర్తింపు



అబ్దుల్, అసీన్ (ఫైల్)

హోసూరు(క్రైం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బాగలూరు సమీపంలో అసోం రాష్ట్రానికి చెందిన దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అబ్దుల్ అజిత్(23), భార్య అసీన్ అబ్దుల్లాష్కర్ (20) ప్రేమవివాహం చేసుకున్నారు. బాగలూరు సమీపం చుంచిరగానపల్లిలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. స్థానిక ప్రైవేట్ కర్మాగారంలో పనిచేస్తూ వచ్చారు. తరచూ గొడవ పడేవారు, మంగళవారం ఉదయం ఎంతసేపటికి ఇంటి తలుపులు తెరవకపోవడంతో అనుమానంతో స్థానికులు కిటికీ నుంచి గమనించారు. ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. అబ్దుల్ గదిలోపల, అసీన్ గది ఉరి వేసుకుని ఆత్మహత్యరే పాల్పడ్డారన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తొలుత భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు, తర్వాత భార్య ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. బాగలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

జర్నలిస్ట్ అసోసియేషన్ ఎన్నికలకు 44 నామినేషన్లు



నామినేషన్ స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి నాగరాజు

బళ్లారి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కర్ణాటక వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ బళ్లారి జిల్లా యూనిట్ 2025-28 ఎన్నికలకు మొత్తం 44 నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎన్నికల అధికారి నాగరాజు మంగళవారం తెలిపారు. విలేకరులతో మాట్లాడిన ఆయన అక్టోబరు 19న నామినేషన్ల తేదీ ప్రారంభం అయ్యిందని, నామినేషన్లకు చివరి తేదీ 27 కాగా 28న నామినేషన్ల స్క్రూటినీ చేశామన్నారు. సంఘంలోని 25 పదవులకు 44 నాలుగు నామినేషన్లు దాఖలు అయ్యాయని, అన్నీ అమోదం చెందాయని ఆయన తెలిపారు.

వర్షాలతో ఉల్లి పంటకు మొలకలు

● సర్వం నష్టపోతున్నట్లు రైతుల ఆవేదన



మొలకలు వచ్చిన ఉల్లిపంటను చూపుతున్న రైతు సుగ్గినళ్లి రుద్రప్ప

కంప్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ఉల్లి పండించిన రైతులకు కన్నీళ్లు మిగిలాయి. తీవ్ర నష్టాలతో అప్పులపాలు అయ్యామని సిరిగేరి ఉల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాను ప్రభావంతో గత వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు గ్రామంలోని రైతులు పదుల ఎకరాల్లో పండించిన మిరప, మొక్క జొన్న, పత్తి, జొన్న, నష్టం వాటిల్లింది. రైతులు సుగ్గినళ్లి రుద్రప్ప, లింగప్ప, ప్రకాష్ నాలుగు ఎకరాల్లో ఉల్లిపాయలు పూర్తిగా నాశనమయ్యాయని వాపోయారు. పొలంలోనే ఉల్లిపాయలకు మొలకలు వచ్చాయని, రూ.లక్షలు పోసి పండించిన పంట చేతికందకనే పాడయిపోయిందని వాపోయారు. గత సంవత్సరం వారు మిరపకాయలు పండించి తమ జేబులు నింపుకున్నారు. ఈ సంవత్సరం వారు తమ జేబులు ఖాళీ చేసుకున్నారు. పంటను నిల్వ చేయడానికి షెడ్ నిర్మించారు. వర్షం వల్ల ఉల్లి పంట పూర్తిగా నేలపాలైంది. మొత్తం నాలుగు ఎకరాల్లో ఉల్లిపాయలు పండించారు. రూ. ఐదు లక్షలు వరకు ఖర్చు చేశారు. వర్షాల కాంరణంగా సరైన ధర లభించకుండా వాటిని కుళ్లిపోయిన స్థితిలో వదిలేశారు. ఎకరానికి రూ.600 నుంచి రూ.700 ఉల్లి పాకెట్లు పండించి మంచి ధరకు అమ్ముతున్నాము. కానీ అకస్మాత్తుగా కురిసిన వర్షం కారణంగా వాటిని పొలంలోనే వుంచాము. అవి ఇంట్లో వాడుకోవడానికి కూడా సరిపోని పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి వెంటనే పరిహారం విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సంబంధిత రెవెన్యూ, ఉద్యానవన శాఖ అధికారులు ఇప్పటివరకు వర్షం వల్ల దెబ్బతిన్న పంటల జాబితాను తయారు చేసి సమాచారం అందించి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. బ్యాంకుల్లో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అద్భుతం.. లేపాక్షి ఆలయం

● కర్ణాటక ఆర్టీఐ కమిషనర్ మమత



ఆలయ చరిత్రను తెలుసుకుంటున్న ఆర్టీఐ కమిషనర్ మమత

లేపాక్షి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో శిల్ప, చిత్రకళలు అద్భుతమని కర్ణాటక ఆర్టీఐ కమిషనర్ మమత అన్నారు. మంగళవారం ఆమె ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్థాంతరంగా ఆగిన కళ్యాణమండపం, సీతాదేవిపాదం, వేలాడే స్థంబాన్ని సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆలయంలో శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయంటూ శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం దుర్గా, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందుకున్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

నాయని సుబ్బారావు (జయంతి)




తొలితరం 'తెలుగు భావక వి'గా గుర్తింపు పొందిన నాయని సుబ్బారావు 1899 అక్టోబరు 29న ప్రకాశం జిల్లా పొదిలి పట్టణంలో జన్మించారు. స్వాతంత్ర్య పోరాటం, సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో ఆయా ప్రసారాలకు అవసరమయ్యే విషయాలను రాసేవారు. ఎక్కువగా గ్రామస్థుల కార్యక్రమాలకు రాసేవారు. వివిధ అంశాలపై రాసిన 25 ఖండికలను ౹భాగ్యనగర కోకిల్'గా ప్రచురించారు. సౌభద్రుని ప్రణయయాత్ర అనే ఆత్మకథాత్మక కావ్యం, వేదనా వాసుదేవము, విషాద మోహనం స్మృతి కావ్యాలు, జన్మభూమి అనే మహాకావ్యం ఎంతో గుర్తింపు పొందాయి. 1978 జూలై 8న కన్నుమూశారు.

వాలి (జయంతి)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత తమిళ కవి, గేయరచయిత వాలి 1931 అక్టోబరు 29న తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లి జిల్లా శ్రీరంగం ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు టీఎస్ రంగరాజన్. తమిళ సినీరంగంలో ఐదు దశాబ్దాల్లో 15వేలకుపైగా పాటలు రాశారు. అంతేకాక పలు సినిమాలలో సైతం నటించారు. తమిళనాడు ప్రభుత్వం నుంచి ఉత్తమ గేయరచయిత పురస్కారాన్ని ఐదుసార్లు పొందారు. అమ్మవారిపై ఆయన రాసిన పాటను మధురై ఆలయంలో రాయిపై చెక్కించారు. ఎన్నో గౌరవాలు, పురస్కారాలు అందుకున్నారు. 2013 జూలై 18న కన్నుమూశారు.

మాథ్యూ హేడెన్ (పుట్టినరోజు)



ఆస్ట్రేలియా దేశ ప్రముఖ క్రికెటర్ మాథ్యూ హేడెన్ 1971 అక్టోబరు 29న జన్మించారు. క్రికెట్ కామెంటేటర్‌గాను రాణించారు. 6.2 అడుగుల పొడగరి. ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా గుర్తింపు పొందారు. 15ఏళ్ల కెరీర్‌లో టెస్టుమ్యాచులలో వ్యక్తిగత స్కోరు 380 పరుగులతో రికార్డు కలిగారు. లెఫ్ట్‌హ్యాండ్ బ్యాట్స్‌మెన్, కుడిచేత్తో బౌలింగ్ అలవాటు, లెగ్‌స్పిన్ ప్రత్యేకత. 2009లో క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. 2017లో ఆస్ట్రేలియన్ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేంలో చోటు దక్కించుకున్నారు. 2021లో పాకిస్థాన్ జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరించారు. కాగా 3 వంటల పుస్తకాలు కూడా రాయడం విశేషం. 2022 టీ-20 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్ టీమ్‌కు మెంటార్‌గా వ్యవహరించారు.

విజేందర్‌సింగ్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత విజేందర్‌సింగ్ 1985 అక్టోబరు 29న హర్యానా రాష్ట్రం భివాని జిల్లా కలువాస్ ప్రాంతంలో జన్మించారు. బాక్సింగ్ క్రీడాకారుడు. 2000లో జాతీయ పోటీలలో తొలి బంగారు పతకాన్ని సాధించారు. 2003లో ఆలిండియా యూత్‌బాక్సింగ్ ఛాంపియన్‌గా నిలిచారు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించారు. 2009 వరల్డ్ ఛాంపియన్‌షిప్స్, 2010 కామన్వెల్త్ గేమ్స్‌లోనూ, 2014 కామన్వెల్త్ గేమ్స్‌లోనూ రాణించారు. ఆ తర్వాత ఏటా పలు పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుకున్నారు. ఇంతవరకు 13 ఫైట్‌లు చేయగా 12 గెలుపొందడం విశేషం. మేజర్ ధ్యాన్‌చంద్ అవార్డు, అర్జున అవార్డు పొందారు. ఇటీవల ఆయన బీజేపీలో చేరారు.

స్వప్న బర్మన్ (పుట్టినరోజు)



స్వప్న బర్మన్ 1996 అక్టోబరు 29న పశ్చిమబెంగాల్ రాష్ట్రం జల్పైగురి పట్టణ ప్రాంతంలో జన్మించారు. ఆమెకు ఒక్కోకాలికి ఆరు వేళ్లు ఉండడం గమనార్హం. 2017 ఏషియన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్స్‌లో హెప్టాథ్లాన్ విభాగంలో తొలి స్థానంలో నిలిచారు. 2018 ఏషియన్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించగా 2019లో అర్జున అవార్డు అందుకున్నారు. 2022 నేషనల్ గేమ్స్‌లో హెప్టాథ్లాన్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. రాహుల్‌ద్రావిడ్ అథ్లెట్ మెంటార్‌షిప్ ప్రోగ్రామ్‌కింద శిక్షణ పొంది అథ్లెట్స్‌గా రాణించడం విశేషం.

చారిత్రక డ్యాం.. అభివృద్ధికి ఆమడదూరం

● మార్కండేయ డ్యాం వద్ద మౌలిక సదుపాయాల కొరత ● సరైన రహదారులు లేక పర్యాటకులు విలవిల ● అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం



డ్యాం వద్ద గుంతలమయమైన మట్టిరోడ్డు

బంగారపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బూదికోటె హోబళిలో గల మార్కండేయ డ్యాంకు మినీ కేఆర్‌ఎస్ అనే పేరుంది. ఇటీవల వర్షాలతో జలకళ సంతరించుకున్నా సందర్శనకు తగినరీతిలో మౌలిక సదుపాయలు లేవు. డ్యాంకు వెళ్లే మార్గం కొంతమేర మట్టిరోడ్డు, బురదమయం కావడం, చుట్టుపక్కల చెట్లు కొట్టివేయడంతో ఇక్కడికి వచ్చేందుకు పర్యాటకులు ఆసక్తి చూపడం లేదు. చరిత్ర ప్రకారం బూదికోటె చెరువుకు డ్యాంను అప్పటి దివాన్‌గా ఉన్న మిర్జా ఇస్మాయిల్‌కాలంలో కేఆర్‌ఎస్ తరహాలో రూపొందించారు. బూదికోటె గ్రామంనుంచి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోని మార్కండేయడ్యాంను వీక్షించేందుకు వారాంతంతోపాటు సాధారణ రోజుల్లోనూ వేర్వేరు ప్రాంతాలవారు వస్తుంటారు. అయితే ఇక్కడ పర్యాటకులకు సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు.

● సుమారు 700-800 ఎకరాల విస్తీర్ణంలో చెరువు నిర్మాణానికి 1938లో మైసూరు రాజసంస్థానంలో దివాన్‌గా ఉన్న మిర్జా ఇస్మాయిల్ కాలంలో పథకాన్ని రూపొందించారు. 1940లో డ్యాం నిర్మాణం పనులు పూర్తయ్యాయి. డ్యాం పూర్తయ్యాక చెరువు ఆయకట్టులోని రైతులకు ఎంతో అనుకూలమైంది. తద్వారా వరిసాగుకు ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. అయితే ఇటీవలికాలంలో నీటి కొరత కారణంగా వరికి బదులు ఇతర పంటలసాగు పట్ల ఆసక్తి చూపారు.


అభివృద్ధి ఏదీ..?

జలాశయం సుమారు 700-800 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇంతటి భారీ చెరువును చూసేందుకు ప్రజలు, పర్యాటకులు ఇక్కడికి వస్తే కనీస శౌచాలయ వ్యవస్థ కూడా లేదు. సుమారు 500మీటర్ల మేర రోడ్డు కంకరతేలి గుంతలమయంగా మారింది. ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పర్యాటకులు ఇక్కడికి వచ్చేందుకు వెనుకంజవేస్తున్నారు. భారీ నీలగిరి చెట్లు కూలిపోయి సుమారు ఏడాది అవుతున్నా వాటిని తొలగించేందుకు ఏ శాఖ అధికారులు కూడా ఆసక్తి చూపలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

● మార్కండేయ డ్యాం నిండి మరవ ప్రవహించినప్పుడు వృథాగా తమిళనాడుకు వెళ్తోంది. దీన్ని అడ్డుకునేలా బలమందె పంచాయతీ పరిధిలోని యరగోళ గ్రామంలో యరగోళ డ్యాం నిర్మించారు. మార్కండేయ డ్యాం నుంచి వెళ్లే నీరు యరగోళ డ్యాంకు చేరుతోంది. 2022లో మార్కండేయ డ్యాం నిండి మరవపారిన వారానికి యరగోళ డ్యాం కూడా నిండింది. అయితే పర్యాటకులకోసం కనీస సదుపాయాలు లేవని పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. చెరువును వీక్షించేందుకు దిగేందుకు మెట్ల వద్ద ఎలాంటి అడ్డుగోడ లేకపోవడంతో వయసైనవారు దిగేందుకు భయపడుతున్నారని, ముందస్తు చర్యలు తీసుకోవాలని బూదికోటె వాసి మహేశ్ అభిప్రాయపడ్డారు. గుల్లహళ్ళి గ్రామస్థుడు చంద్రు మాట్లాడుతూ గతవారం రోజులుగా వర్షాలతో అనేక చెరువులనుంచి డ్యాంకు చేరుతోందని, ఇదే విధంగా కొనసాగితే త్వరలోనే డ్యాం నిండే అవకాశం ఉందన్నారు. పర్యాటకులకోసం కనీస సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చొరవ చూపాలని కోరారు.



కూలిపోయిన భారీ వృక్షం



సందర్శకులు లేక వెలవెలబోతున్న డ్యాం

స్పీకర్‌పై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తా

● మాజీ స్పీకర్ విశ్వేశ్వర హెగ్డే కాగేరి

బెంగళూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ అవినీతి ఆరోపణలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తానని మాజీ స్పీకర్, ఎంపీ విశ్వేశ్వరహెగ్డే కాగేరి తెలిపారు. బెంగళూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల కొనుగోలు చేసిన టీవీ, ఎమ్మెల్యేలకు మసాజ్ చైర్, గండభేరుండ గడియారం, ఇంకా అల్పాహారం, భోజనం ఇలా ప్రతిఅంశంలోనూ అక్రమాలు జరిగాయన్నారు. సుమారు 7-8వేల రూపాయల సామగ్రికి రూ.30-40వేల బిల్ చేశారన్నారు. స్పీకర్ స్థానానికి తగిన హోదాలో ఆయన నడుచుకోవడం లేదన్నారు. ప్రతి అంశం అనుమానాస్పదంగా ఉందన్నారు. సమగ్ర దర్యాప్తుకై గవర్నర్‌కు ఫిర్యాదు చేయదలిచినట్టు తెలిపారు.

వినయ్ కులకర్ణికి సుప్రీంలో షాక్

బెంగళూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్యే వినయ్ కులకర్ణికి సుప్రీంకోర్టులో షాక్ తగిలింది. ధారవాడ బీజేపీ జడ్పీ సభ్యుడు యోగేశ్‌గౌడ హత్యకేసులో జైలులో ఉన్న వినయ్ కులకర్ణి సాక్ష్యాలు నాశనం చేశారనే అంశాన్ని సుప్రీంకోర్టు ఎత్తి చూపింది. సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణ జరిపిన సుప్రీంకోర్టు సాక్ష్యాలు నాశనం చేసినట్టు అభిప్రాయపడింది. యోగేశ్‌గౌడ హత్యకేసులో సాక్ష్యాలు నాశనం చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. అయితే హైకోర్టు ఈ అంశానికి సంబంధించిన కేసును కొట్టివేసింది. సీబీఐ అధికారులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా సాక్ష్యాలు నాశనం చేసిన అంశాన్ని ప్రస్తావించింది. హైకోర్టునుంచి బెయిల్ దక్కినా ఈ ఏడాది జూన్ 6న సుప్రీంకోర్టు బెయిల్ తిరస్కరించింది. దీంతో 14న జైలుకు చేరారు. సాక్ష్యాలు నాశనం చేసిన ఆరోపణలను మరోసారి ఎదుర్కోనాల్సి వచ్చింది.



అలంకరణలో అమ్మవారు

చౌడేశ్వరీదేవికి విశేష పూజలు

శిడ్లఘట్ట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మేలూరు గ్రామంలో కార్తీక మంగళవారం పురస్కరించుకుని చౌడేశ్వరిదేవికి విశేషపూజలు నిర్వమించారు. అభిషేకం, అలంకరణ చేశారు. మహా మంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

ఘనంగా ఛట్‌పూజ



ఛట్‌పూజలో పాల్గొన్న భక్తులు

మహదేవపుర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనసహాయోగ్ సంఘం ఆధ్వర్యంలో సాదరమంగల చెరువులో ఛట్‌పూజ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. సూర్యాస్త, సూర్యోదయ సమయంవేళ సూర్యుడికి అర్ఘ్యం సమర్పించడం ద్వారా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సంఘం అధ్యక్షుడు బీర్‌బహదూర్‌సింగ్ నేతృత్వం వహించారు. భక్తులు సంప్రదాయంగా దీపారాధన చేశారు. బిహార్, ఉత్తరప్రదేశ్‌వాసులు ఛట్‌పండును సంప్రదాయంగా పాటించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ పీసీ మోహన్ పాల్గొన్నారు. నాలుగురోజులుగా ఉత్సవానికి మాజీ మంత్రి అరవింద లింబావళి ఏర్పాట్లు పర్యవేక్షించారు. మంజునాథ్, శ్రీరాములు, సంఘం పదాధికారులు, రాజేశ్‌కుమార్, సీతారాం యాదవ్, సునీల్‌సింగ్, పంకజ్ పాల్గొన్నారు.

పోలీసు భద్రతతో హుండీ లెక్కించాలి: ఎస్ఐ

సిరుగుప్ప, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆలయ కమిటీ హుండీ లెక్కింపులను కమిటీ సభ్యుల అనుమతితో పోలీసుల బందోబస్తుతో లెక్కించాలని సిరిగేరి ఎస్ఐ శశిధర్ సూచించారు. మంగళవారం తాలుకా పరిధిలోని సిరిగేరి పోలీస్‌స్టేషన్లో ఎస్ఐ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. షానవాజ్‌పుర, సిరిగేరి, కొంచిగేరి, దాసాపురం వివిధ గ్రామాల ఆలయ కమిటీ సభ్యులు ఇందులో పాల్గొన్నారు. ఎస్ఐ శశిధర మాట్లాడుతూ చట్టపరిధిలో హుండీ లెక్కింపు చేపట్టాలని, ఆభరణాలు వెండి, బంగారు నగలు వాటిని బ్యాంకు లాకర్‌లో వుంచాలని సూచించారు. ఆలయంలో ఇతరుల నుంచి ఏమైనా సమస్యలు వుంటే పోలీస్ స్టేషన్‌కు తెలిపి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

సగానికి తగ్గిన థర్మల్ విద్యుత్ ఉత్పత్తి

● రెండు యూనిట్లలో ఉత్పత్తి నిలిపివేత



రాయచూరు థర్మల్ విద్యుత్ కేంద్రం

రాయచూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రెండు థర్మల్ విద్యుత్ కేంద్రాలలో అధికారులు సోమవారం రాత్రి నుంచి ఉత్పత్తిని గణనీయంగా నిలిపివేశారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తూ జల ఉత్పత్తి పెద్ద ఎత్తున అందుబాటులోకి రావడంతో పాటు సోలార్, పవన విద్యుత్‌లు కూడా అందుబాటులో ఉన్న నేపథ్యంలో అధికారులు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని తగ్గించి వేశారు. శక్తినగర్ వద్ద ఉన్న ఆర్‌టీపీఎస్ విద్యుత్ కేంద్రంలో 8 యూనిట్‌ల ద్వార రోజు 1720 మెగావాట్ల ఉత్పత్తి జరగాల్సి ఉండగా 2,3 యూనిట్‌లు మినహా మిగితా ఐదు యూనిట్‌లలో ఉత్పత్తిని నిలిపివేశారు. దీంతో అక్కడ ఉత్పత్తి 540 మెగావాట్లకు పడిపోయింది. దీంతో పాటు నగర సమీపంలోని వైటీపీఎస్‌లోని రెండు కేంద్రాల ద్వార మొత్తం 800 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉండగా ఒక్క యూనిట్‌లో మాత్రమే ఉత్పత్తిని కొనసాగిస్తుండగా ఆ యూనిట్‌లో కేవలం 500 మెగావాట్ల ఉత్పత్తి మాత్రం జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా థర్మల్ విద్యుత్ కేంద్రాలలోని సగం యూనిట్‌లలో ఉత్పత్తిని నిలిపివేసిన నేపథ్యంలో మిగిలిన మరమ్మత్తు పనులను వేగవంతంగా చేసేందుకు నిర్ణయించినట్లు అధికారులు చెబుతున్నారు. బొగ్గు సరఫరా యూనిట్‌లో మొదలుకొని మిగితా వాయిదా వేస్తూ వచ్చిన మరమ్మత్తు పనులన్నింటిని వేగవంతంగా పూర్తి చేసి పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యానికి కావల్సిన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వివరిస్తున్నారు.

పిల్లలకు విలువలు నేర్పాలి

● వ్యక్తిత్వ వికాస నిపుణుడు మేధా చిరంజీవి



జ్ఞాపికలతో చిన్నారులు, ప్రముఖులు

బెంగళూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): చదువు ప్రతి వ్యక్తికి కీలకమైనదని, బాల్యంనుంచే నైతిక విలువలు ఉపాధ్యాయులు నేర్పాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు మేధా చిరంజీవి అభిప్రాయపడ్డారు. వాగ్దేవి విలాస్ పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. భాష ఏదైనా సమగ్ర భావం తెలిసేవరకు అవగాహన పొందాలన్నారు. ఉపాధ్యాయుల ద్వారా విద్యలో రాణించవచ్చునని, కానీ తల్లిదండ్రులు మంచి విద్యాసంస్థలను ఎంపిక చేయడంలో కీలకమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. వాగ్దేవి సంస్థల చైర్మన్ హరీశ్ మాట్లాడుతూ.. చదువుతోపాటు సంగీతం, సాహిత్యం ఇతర కళలపట్ల అభిమానం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సీఈఓ శాలెట్, ప్రిన్సిపాల్ దేవదయఘోష్, ప్రమోద్‌భట్, రాఘవేంద్రభట్ తదితరులు పాల్గొన్నారు.

రబీకి సాగునీరు విడుదల చేయాలి

● మాన్వి మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక్

రాయచూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గేట్ల మరమత్తు పేరుతో రబీ సీజన్‌లో రెండవ పంటకు నీరు విడుదల చేయమంటు ప్రభుత్వం ప్రకటించడం పట్ల మాన్వి మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్ననేపథ్యంలో రెండవ పంటకు కచ్చితంగా నీరిచ్చి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం మాన్వి పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రెండవ పంట పూర్తైన తక్షణమే గేట్ల మరమ్మత్తును చేసే అవకాశం ఉన్నా గేట్ల మరమ్మత్తు సాకుతో రెండవ పంటకు నీరివ్వకపోవడం అన్యాయమన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయక్

నేడు రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి భూమిపూజ

బాగేపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని పరగోడు సమీపాన మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌కు బుధవారం భూమిపూజ చేయనున్నారు. తాలూకా ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం కేపీసీసీ మైనారిటీ సమితి జిల్లా కార్యదర్శి మమ్మద్ ఎస్ సూరుల్లా మాట్లాడుతూ రాష్ట్ర వక్ఫ్, వసతిశాఖల మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్ బుధవారం పట్టణానికి విచ్చేసి రెసిడెన్షియల్‌స్కూల్‌కు, హుసేన్‌షావలి దర్గాకు భూమిపూజ చేస్తారన్నారు. ఎమ్మెల్యే ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైందన్నారు. రూ.16కోట్లతో వసతి పాఠశాల భవనాన్ని, దర్గా భవనం అభివృద్ధికి రూ.2కోట్లు మంజూరు చేశారన్నారు. మీడియా సమావేశంలో కేడీపీ సభ్యుడు రిజ్వాన్‌సాబ్, కేపీసీసీ తాలూకా మైనారిటీ సమితి తాలూకా అధ్యక్షుడు నిజాముద్దీన్, పురసభ మాజీ సభ్యుడు జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు వాయిదా

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఈనెల 29వ తేదీన నిర్వహించాల్సిన ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా స్థాయి క్రీడా పోటీలను వాయిదా వేస్తున్నామని డీఎస్‌డీఓ మంజుల తెలిపారు.

ఎముకల బలహీనతకు రామయ్యలో అత్యాధునిక వైద్యం

బెంగళూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రామయ్య మెమోరియల్ ఆసుపత్రిలో వరల్డ్ ఆస్టియోపోరోసిస్ (ఎముకల బలహీనత) డేను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం జరిపారు. డీఎక్స్‌ఏ స్కానర్ ద్వారా ఎముకలకు సంబంధించిన జబ్బులను వేగవంతంగా గుర్తించడంతోపాటు సూక్ష్మమైన అంశాలను సైతం గ్రహించనుందని ఎండోక్రైనాలజీ అడ్వైజర్ డాక్టర్ ఎస్ చైత్ర అభిప్రాయపడ్డారు. ఎముకల బలహీనత అనేది మౌనరోగంగా పిలుస్తారు. విశ్వవ్యాప్తంగా 500 మిలియన్లమందిని ప్రభావితం చేస్తోందన్నారు. సాధారణదశలోనే గుర్తింపు ద్వారా తీవ్రమైన పరిణామాలనుంచి ఉపశమనం పొందవచ్చునన్నారు. శారీరకంగా అలసట, నొప్పి పెరుగుతుందన్నారు. దేశంలో వయస్సు, కూర్చునే జీవనశైలి, పౌష్టికాహార లోపం వంటి కారణాలతో వేగవంతంగా ఎముకల బలహీనత ఏర్పడుతుందన్నారు. 50ఏళ్లు పైబడిన ఐదుమంది మహిళల్లో ఒకరికి, 20మంది పురుషులలో ఒకరు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనికి చికిత్స లేదనేది అవాస్తవమని అయితే సరైన సమయానికి వ్యాధి గుర్తించి వైద్యసేవలు పొందాలన్నారు. 50ఏళ్లు పైబడిన మహిళలు కీళ్ల ఆరోగ్యంపై అవగాహన పొందాలన్నారు. డీఎక్స్‌ఏ స్కానర్ ద్వారా బీఎండీ పరీక్షలు జరిపించుకోవాలన్నారు. ఎముకలు, మెటబాలిక్ హెల్త్‌స్కానర్ బహువిధమైన రోగాన్ని గుర్తించనుందన్నారు. లేటరల్ వాటెబ్రల్ అసిస్టెంట్, వాటెబ్రల్ ఫ్రాక్చర్ అసిస్టెంట్‌లను అడ్వాన్స్ బాడీ కంపోర్స్ పరీక్షల ద్వారా గుర్తించవచ్చునన్నారు. రామయ్య మెమోరియల్ ఆసుపత్రి సీఈఓ డాక్టర్ ఎస్‌సీ నాగేంద్రస్వామి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న జబ్బులపట్ల అవగాహన పొందాలన్నారు.



రామయ్య ఆస్పత్రిలో డీఎక్స్‌ఏ స్కానర్ గురించి వివరిస్తున్న వైద్యులు

వైసీపీకి షాక్..!

తిరగబడ్డ ఎంపీటీసీలు.. బెళుగుప్ప ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం వద్దంటూ ఆర్డీఓకి వినతి



ఆర్డీఓకి వినతిపత్రం ఇస్తున్న వైసీపీ ఎంపీటీసీలు

బెళుగుప్ప, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీకి ఆ పార్టీ ఎంపీటీసీలు షాకిచ్చారు. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం విషయంలో ఎదురు తిరిగారు. ఎంపీపీ పెద్దన్నను అవిశ్వాసం పెట్టి ఒక్కరోజైనా పదవి నుంచి దించాలన్న వైసీపీ నాయకుల అంచనాలను తారుమారు చేశారు. అవిశ్వాస తీర్మానం వద్దు అంటూ ఆ పార్టీకి చెందిన ఆరుగురు ఎంపీటీసీలు మంగళవారం ఆర్డీఓ వసంతబాబుకు వినతిపత్రం ఇచ్చారు. అప్పట్లో వైసీపీ నాయకులు మభ్యపెట్టి అవిశ్వాస తీర్మానంపై తమతో సంతకాలు చేయించారనీ, ఆ నిర్ణయాన్ని వెనక్కుతీసుకుంటున్నామని వారు తెలిపారు. బెళుగుప్ప, శీర్పి, తగ్గుపర్తి, బెళుగుప్ప తండా, కాలువపల్లి నుంచి టీడీపీలోకి చేరిన వారు.. ఎంపీపీ పెద్దన్నకు మద్దతు పలికారు. అనంతపురంలో జడ్పీ సీఈఓకు కూడా వినతిపత్రం ఇచ్చారు. ఎంపీపీగా పెద్దన్నను కొనసాగించాలని ఆర్డీఓను కోరారు. మరికొందరు వైసీపీ ఎంపీటీసీలు మద్దతు తెలిపే అవకాశాలున్నాయని టీడీపీ నాయకులు తెలిపారు. మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. అప్పట్లో టీడీపీ పోటీ నుంచి తప్పుకోవడంతో అందరూ వైసీపీ సభ్యులే ఏ కగ్రీవమయ్యారు. ఎంపీపీగా పెద్దన్నను ఎన్నుకున్నారు. ఆయన సార్వత్రిక ఎన్నికల అనంతరం టీడీపీలో చేరారు. ఆయనను ఎంపీపీ పీఠం నుంచి దించాలని వైసీపీ నాయకులు భావించారు. తమకే సంపూర్ణ బలం ఉందనీ, అవిశ్వాసం నెగ్గుతామని ధీమాగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల పది మంది ఎంపీటీసీలు.. అవిశ్వాస తీర్మానానికి అవకాశం కల్పించాలని ఆర్డీఓకి వినతిపత్రం ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో ఎంపీపీ పెద్దన్నతోపాటు ఐదుగురు సభ్యులు అవిశ్వాసం వద్దు అంటూ ఆర్డీఓ, జడ్పీ సీఈఓకి వినతిపత్రాలు ఇవ్వడం గమనార్హం.

బైక్‌లు ఢీకొని యువకుడి దుర్మరణం

సోమందేపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ్రాయనపల్లి వద్ద జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాలు ఢఢీకొన్న ప్రమాదంలో బెంగళూరుకు చెందిన గణేష్(23) దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గణేష్ సోమందేపల్లిలోని నక్కలగుట్ట కాలనీలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చాడు. మంగళవారం తిరుగు ప్రయాణమయ్యాడు. నాగినాయనిచెరువు తండాకు చెందిన గోపాల్‌నాయక్ సోమందేపల్లిలో చదువుతున్న మనవరాలిని పిలుచుకుని స్వగ్రామానికి వెళ్తూ రోడ్డు దాటుతుండగా గణేష్ ఢీకొట్టాడు. ప్రమాదంలో గణేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. గోపాల్‌నాయక్, అతడి మనవరాలు గాయపడ్డారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు. గణేష్ మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు.

టమోటా కిలో రూ.24

అనంతపురం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.24తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌కు 1650 టన్నుల టమోటా కాయలు వచ్చాయన్నారు. టమోటా కిలో కనిష్ఠ ధర రూ.12, సరాసరి ధర రూ.17తో విక్రయాలు జరిగాయని పేర్కొన్నారు.

రహదారుల దుస్థితి పై వాడివేడి చర్చ

●ఎమ్మెల్యే మహానగర పాలికె సభ్యుల మధ్య వాగ్వాదం



సమావేశంలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే శివరాజ్ పాటీల్

రాయచూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్ద ఎత్తున దెబ్బతిన్న నగర రహదారులపై మంగళవారం జరిగిన మహానగర పాలిక సభలో వాడివేడి చర్చ సాగింది. రోడ్ల మరమ్మతు అంశానికి సంబంధించి సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతుండగా మధ్యలో జోక్యం చేసుకున్న సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్ రోడ్ల మరమ్మత్తుకు ప్రభుత్వం నుంచి నిధులు రాలేదని విమర్శించారు. ఈ దశలో సభ్యులు అసహనంగా ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. జోక్యం చేసుకున్న సీనియర్ సభ్యుడు జయణ్ణ నగర పరిధిలో రోడ్ల మరమ్మతు కోసం ప్రభుత్వం నుంచి నిధులు తెప్పించే బాధ్యత సిటీ ఎమ్మెల్యేదేనన్నారు. దీంతో ఒక్కసారిగా ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేయగా ఎమ్మెల్యేకు సభ్యులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. కాగా నగరంలో పూర్తిగా దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతు చేయాలని సభలో తీర్మానించడంతో సభ్యులు శాంతించారు.

వైటీపీఎస్‌లో అగ్ని ప్రమాదం

రాయచూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగర సమీపంలోని వైటీపీఎస్ థర్మల్ విద్యుత్ కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బొగ్గు సరఫరా చేసే విభాగంలో ఒక్కసారిగా నిప్పులు అంటుకుని మంటలు ఎగసి పడడంతో సిబ్బంది భయంతో బయటకు పరుగెత్తారు. వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేసి దాదాపు రెండు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో లక్షలు విలువ చేసే విద్యుత్ కేంద్రం యంత్రాలు ధ్వంసమైనట్లు అధికారులు చెబుతున్నారు. సకాలంలో సరైన మరమ్మత్తులు లేకపోవడం నిర్వహణలోపం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వైటీపీఎస్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుతున్నాయని అదృష్టవశాత్తు ప్రాణాపాయం జరగకపోవడంతో ఎలాంటి ఆందోళన లేదని స్థానికులు తెలిపారు. సంఘటన స్థళాన్ని పరిశీలించిన రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రమాదం పై దర్యాప్తు జరుపుతున్నారు.



దగ్ధమవుతున్న యంత్రాలు

పైపైకి ధరలు

టమోటా రైతుల్లో ఆనందం.. కొనసాగితే లాభాలేనంటున్న అన్నదాతలు

తనకల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు టమోటా ధరలు పెరుగుతున్నాయి. దీంతో టమోటా రైతుల్లో ఓ వైపు ఆనందం మరోవైపు ఆవేదన వ్యక్తం అవుతున్నాయి. వారం రోజులుగా ఎడతెరిపి లేని వర్షాల వల్ల టమోటా పంటకు మచ్చ, తెగుళ్లు వ్యాపించాయి. దీంతో దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలలో వర్షాల కారణంగా టమోటా పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు రైతులు అంటున్నారు. తనకల్లు మండలంలో సీజన్‌తో సంబంధం లేకుండా ఏ సమయంలో చూసినా 2వేల ఎకరాలకు తక్కువ కాకుండా టమోటా పంట సాగులో ఉంటుంది. ఈ పంట సాగు చేయడానికి ఎరువులు, నారు, కూలీలు, కట్టెలు, డ్రిప్ ఎరువులు, రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల కోసం ఎకరానికి రూ. 1.5 లక్షల నుంచి 1.80లక్షల దాకా ఖర్చు చేస్తారు. ఇటీవల టమోటా ధరలు కొంత తగ్గినా వర్షాల వల్ల తిరిగి పుంజుకున్నాయి. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలోని చింతామణి, వడ్డిపల్లి మార్కెట్‌లలో 15 కిలోల బాక్సు ధర రూ.350 నుంచి రూ.400 దాకా పలుకుతున్నట్లు రైతులు తెలిపారు. అన్నమయ్య జిల్లా మొలకలచెరువు, అంగళ్లు, మదనపల్లి మార్కెట్‌లో 30 కిలోల బాక్సు ధర రూ.550 నుంచి రూ.700 దాకా ఉన్నట్లు వివరించారు. ధరలు ఇలాగే కొనసాగితే ఖర్చులు పోను ఎకరానికి రూ.లక్ష నుంచి రెండు లక్షల దాకా ఆదాయం వస్తుందని రైతులు అంచనాలు వేస్తున్నారు.



టమోటాలను కోస్తున్న కూలీలు



మార్కెట్‌కు తరలించడానికి టమోటాలను గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

గిట్టుబాటు అవుతుంది



టమోటా ధరలు ఇలాగే కొనసాగితే రైతులకు గిట్టుబాటు అవుతుంది. నేను మూడు ఎకరాలలో టమోటా పంట సాగు చేశా. వర్షం కారణంగా టమోటాలకు మచ్చలు వస్తున్నాయి. ప్రస్తుతం ప్రతి రోజు ధరలు పైపైకి పెరుగుతున్నాయి. ఇది మరింత కాలం కొనసాగితే రైతులకు మంచి ఆదాయం లభిస్తుంది.

- సుధాకర్‌రెడ్డి, రైతు, కొత్తకురువపల్లి

రైతులకు లాభం



ప్రస్తుతం ఉన్న ధరలు టమోటా పంట సాగులో ఉన్న రైతులకు లాభదాయకంగా ఉన్నాయి. ఖర్చులు పోను ఎకరానికి రూ. 1.5 లక్షల నుంచి రూ. 2లక్షల దాకా ఆదాయం వస్తుంది. వర్షాల వల్ల ఇతర ప్రాంతాలలో టమోటా పంటలు దెబ్బతినడంతోనే ప్రతి రోజు మార్కెట్ లో టమోటా ధరలు పెరుగుతున్నాయి. టమోటా పంట ఏడాది పొడవునా సాగు చేస్తే ఏదో ఒక సందర్భంలో తప్పకుండా మంచి ధర వస్తుంది.

- సూర్యనారాయణరెడ్డి, రైతు, పెద్దకడపలవారిపల్లి



అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రభుత్వ లాంఛనాలతో వీఎన్ రెడ్డి అంత్యక్రియలు


పావగడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, కల్లూరు సుబ్బరావు సమకాలికుడు వెంకటాపురం నరసింహారెడ్డి (వీఎన్ రెడ్డి) అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో మంగళవారం ఆయన స్వగ్రామమైన వెంకటాపురంలో నిర్వహించారు. కలెక్టర్ శుభకల్యాణి, డీఎస్పీ మంజునాథ్, తహసీల్దార్ రవి, మాజీ మంత్రి వెంకటరమణప్ప తదితరులు.. వీఎన్‌రెడ్డి భౌతికకాయాన్ని దర్శించి, పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయనతోటలోనే అంతిమ సంస్కారాలు ప్రభుత్వ లాంఛనాలతో జరిపించారు. తుది దర్శనం కోసం వేలాదిమంది ఆయన అభిమానులు, నాయకులు తరలివచ్చారు. అంత్యక్రియలకు ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది.



చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కొత్త తేదీన ఆర్యన్



విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించిన 'ఆర్యన్' చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 31న ఈ చిత్రం విడుదలవ్వడం లేదు. ఒక వారం ఆలస్యంగా నవంబర్ 7న 'ఆర్యన్' చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు విష్ణు విశాల్ తెలిపారు. 'రవితేజ నటించిన 'మాస్ జాతర', 'బాహుబలి: ది ఎపిక్' చిత్రాలు కూడా ఈ నెల 31న విడుదలవుతున్నాయి. రవితేజతో నాకున్న స్నేహం, రాజమౌళిపై గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన తెలిపారు. అయితే 'ఆర్యన్' తమిళ వెర్షన్ మాత్రం ఈ నెల 31నే విడుదలవనుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆర్యన్' చిత్రానికి ప్రవీణ్ కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్ నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సెల్వ రాఘవన్ కీలకపాత్ర పోషించారు. శ్రేష్ఠ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.



ఉగాదిన విడుదల

అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో తెరకెక్కిస్తోన్న రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. మొదట డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా మేకర్స్ కొత్త తేదీని ప్రకటించారు. 2026 ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ని అడివి శేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకి వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరమే లేదు' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, అడివి శేష్ సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

శ్రీకాంత్ తివారి వచ్చేస్తున్నాడు



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఓ సరికొత్త ఒరవడిని సృష్టించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటి వరకూ రెండు సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో భాగం సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి స్ట్రీమింగ్ వివరాల కోసం అభిమానులు ఎంతగానో ఆసక్తిగా ఎదురుచూడసాగారు. తాజాగా మేకర్స్ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. ఆమెజాన్ ప్రైమ్‌లో నవంబరు 21 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైవలెన్స్ సెల్(టాస్క్) సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ తివారి పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ మరోసారి అలరించనున్నారు. రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ నటనకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మూడో భాగంలో ఆయన నటనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సిరీస్ అందుబాటులో ఉంటుంది.

నటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలి

దేశవ్యాప్తంగా సినీ రంగంలో చర్చనీయాంశమైన పనివేళల అంశంపై కథానాయిక రష్మిక మందన్న స్పందించారు. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక తాను కూడా అధిక పని ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అంగీకరించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ... రోజుకు పది పన్నెండు గంటలకు మించి పనిచేయడం ఎంత కష్టమో, కుటుంబ, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం ఎంత అవసరమో ఆమె వివరించారు. 'నేను కూడా ఎక్కువగంటలు పనిచేస్తున్నాను. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయవద్దని అందరికీ చెబుతున్నాను. ఆఫీసులో ఉద్యోగులకు ఉన్నట్లే నటీనటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ ఉండాలి' అని రష్మిక అభిప్రాయపడ్డారు. ఒక షెడ్యూల్ పెట్టుకోని రోజుకు 8 గంటలు కంటినిండా నిద్రపోవాలి, వృత్తిని వ్యక్తిగత జీవితాన్ని బేలన్స్ చేసుకోవాలని ఆమె సూచించారు. నిర్దీత పనివేళల డిమాండ్‌తో దీపికా పదుకొనే కొన్ని సినిమాల నుంచి వైదొలగిన్పటి నుంచి పలువురు నటీనటులు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.



చట్టమా? విశ్వాసమా?



యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హక్'. ముస్లిం మహిళల హక్కుల పోరాటంలో మైలురాయిగా నిలిచిన 'మొహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షా బానో బేగం' కేసు ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు సుపర్ణ్ వర్మ ఎస్ తెరకెక్కించారు. నవంబర్ 7న ఈచిత్రం విడుదలవుతోంది. హర్మాన్ బవేజా, విశాల్ గుర్నాని నిర్మించారు. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. చట్టం, విశ్వాసం, న్యాయం మధ్య సంఘర్షణ ప్రధానాంశంగా దర్శకుడు కథను మలచిన తీరు ఆకట్టుకుంటోంది. షాబోనో బేగం పాత్రలో యామీ గౌతమ్, ఆమె భర్తగా ఇమ్రాన్ హష్మీ తమదైన శైలిలో నటించి మెప్పించారు.

నా కోసం ఆ వెన్నెల



ప్రేమలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ చెలియా'. నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందిరా దేవి ప్రొడక్షన్స్ పతాకంపై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నా కోసం ఆ వెన్నెల' అంటూ సాగే ప్రేమగీతాన్ని నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు.. హీరో హీరోయిన్ల అనుబంధాన్ని వివరిస్తూ సాగే ఈ గీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ ఆలపించారు.

రెహమాన్ సంగీత విభావరి



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన సంగీత విభావరితో మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'హైదరాబాద్ టాకీస్' ఆధ్వర్యంలో నవంబరు 8న రామోజీ ఫిలిం సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ ' తెలుగు సినిమాలు చేస్తూనే పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా.' అని అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్‌ని డాల్బీ అట్మోస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు.